# బేగంపేట నాలాలో రెండు మృతదేహాలు

■ భయాందోళనలకు గురైన ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ వాసులు ■ పోలీసులకు సమాచారం
■ ఒడిశా రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తింపు ■ మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలింపు
■ రైలు కట్ట దాటే క్రమంలో నాలాలో పడిపోయి ఉంటారు ■ పోలీసుల అనుమానం



నాలా ఒడ్డుకు కొట్టుకొచ్చిన మృతదేహాలు, (ఇన్‌సెట్‌లో ఇద్దరి మృతదేహాలు

బేగంపేట, మే 8,ప్రభాతవార్త : నగరంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బేగంపేట నాలాలో పడి ఇద్దరు హోటల్ కార్మికులు మృతి చెందారు. ఈ ఘటన బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ వాసులను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. రాత్రి భారీ వర్షం తెల్లారే సరికి నాలాలో రెండు మృతదేహాలు కన్పించడంతో ఆందోళణకు గురయ్యారు. మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి అమీర్‌పేట నాలాలో భారీ స్థాయిలో నీటి ప్రవాహం వచ్చింది. నీరు వెళ్లిపోయిన తరువాత ఉదయం రెండు మృతదేహాలను వారు గుర్తించారు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వెంటనే ఈ సమాచారాన్ని బస్తీవాసులు బేగంపేట పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న బేగంపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాలను పరిశీలించారు. ఆ ప్రాంతంలో క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాలను గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి భద్రపరిచారు. ఈ సంఘటనపై బేగంపేట ఇన్స్‌పెక్టర్ రామయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన చంద్రపాండా (38), మనోజ్ దాస్(45)లు గడచిన 15ఏళ్ల క్రితం ఒడిశా నుంచి ఉపాధి కోసం నగరానికి వచ్చారు. నెల రోజుల క్రితం వారు బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో మరో స్నేహితుడు ప్రభాకర్‌తో కల్సి ఉంటున్నారు. వీరంతా అమీర్‌పేట పరిధిలో హోటల్ కార్మికులుగా పనిచేసుకుంటూ పొట్టపోసుకుంటున్నారు. ఎప్పటి లాగానే మంగళవారం రాత్రి తమ పనులు ముగించుకుని గ్రీన్‌ల్యాండ్స్ సర్కిల్ పక్క నుంచి లీలానగర్ మీదుగా రైలు పట్టాలు దాటి బేగంపేటకు చేరుకున్నారు. ఈ క్రమంలో వారంతా గ్రీన్ ల్యాండ్స్ సర్కిల్ లోని ఓ బార్‌లో మద్యం సేవించారు. ప్రభాకర్‌ని భోజనం తీసుకుని నువ్వు రూముకు వెళ్ల మేము మళ్లీ వస్తాం. అంటూ మరో సారి మద్యం తాగేందుకు వెళ్లారన్నారు. వచ్చే సమయానికి భారీ వర్షం కురియడం, అమీర్‌పేట నాలాలో నీటి ఉధృతి ఎక్కువగా చేరడం, ఆ సమయంలో వారు రైలు కట్ట దాటే క్రమంలో నాలాలో పడిపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. అయితే తనకు ఆలస్యంగా వస్తామని చెప్పిన మిత్రులు వర్షానికి ఎక్కడో ఉండి ఉంటారని అనుకున్నానని, ఉదయం చూసే సరికి వారు నాలాలో మృతి చెంది పడి ఉన్నారని, ప్రభాకర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మృతులు ఈ ప్రాంతానికి వచ్చి కొద్ది రోజులే కావడంతో వారికి ఎవరితో విబేధాలు ఉండే అవకాశం లేదని, మద్యం మత్తులోనే వారు నాలాలో పడిపోయి చనిపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించి బధ్రపరిచామన్నారు. మృతుడు మనోజ్ దాస్ సోదరుడు సుక్రుదాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మిగిలిన విషయాలు దర్యాప్తులో వెల్లడయ్యే అవకాశం ఉందని ఇన్స్‌పెక్టర్ రామయ్య తెలియజేసారు.

## తాళ్ళపాక అన్నమాచార్యుల జయంతి వేడుకలు

చిక్కడపల్లి, మే 8 ప్రభాతవార్త: పద కవితా పితామహుడు తాళ్ళపాక అన్న మాచార్యులవారి జయంతి సందర్భంగా శ్రీసాయి శృతి సంగీత అకాడమి ఆధ్వర్యం లో 'సామూహిక సంకీర్తన చేస్తూ నృత్య రూపకల్పన' కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నట్లు అకాడమి ప్రిన్సిపాల్ గౌరీభట్ల లక్ష్మణ మూర్తి, డైరెక్టర్ వసుధామూర్తి వివరించారు. 100 మందికిపైగా అకాడమి విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, అన్నమయ్య పాటలపై శాలిసి అమరనేని, కనక హర్షిణి కూచిపూడి నృత్యరూపకల్పన ఉంటుందన్నారు.



హైదరాబాద్ వార్త

# కూలిన కూలీల బతుకులు

నిర్మాణ సంస్థ నిర్లక్ష్యం



ప్రమాదం జరిగిన ప్రాంతం

➠ భారీ ప్రహరీ గోడ కూలి 7గురు వలస కార్మికుల దుర్మరణం
➠ ప్రమాదంలో గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలింపు

బ్రతుకు తెరువు కోసం నగరానికి వచ్చిన వలస కూలీలను ప్రహరీ గోడ రూపంలో మృత్యువు కబలించింది. ఓ నిర్మాణ సంస్థ నిర్లక్ష్యం ప్రహరీ గోడ కూలి ఏడుగురు వలస కార్మికులు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు, జిహెచ్ఎంసి, ఎన్‌డిఆర్ఎఫ్ రెవెన్యూ విభాగం సంఘటన స్థలానికి చేరుకొని జెసిబిలా సహాయంతో క్షతగాత్రులను వెలికి తీసి ఈ ప్రమాదంలో గాయపడ్డ నలుగురిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

కొంపల్లి, మే 8, ప్రభాతవార్త : వివరాల్లోకి వెళితే.. బాచుపల్లి పరిధిలోని రేణుక ఎల్లమ్మ కాలనీలో అరవిందరెడ్డి అనే వ్యక్తి హరిజన్ డెవలపర్స్ పేరుతో భారీ నిర్మాణం చేప డుతున్నారు. ఇందులో ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్ వంటి పలు రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు పని చేస్తున్నారు. వీరికి నివాసం కోసం నిర్మాణ సంస్థ తమ ప్రహరీ గోడకు ఆనుసంధా నంగా రేకుల షెడ్లు నిర్మించారు. కార్మికులు రోజు వారి పనులు పూర్తి చేసుకుని ఆ రేకుల షెడ్‌లో నివాసం ఉంటున్నారు. మంగళవా రం నిర్మాణ పనులు ముగించుకుని తమ నివాసం చేరుకోగా భారీ వర్షం ప్రారం భమైంది. ప్రహరీ గోడ నాణ్యత లేకపోవడం తో ఒక్కసారిగా కుప్పకూలడంతో ఏడుగురు కార్మికులు అక్కడిక క్కడే మృతి చెందారు. మృతుల్లో భార్యభర్తలతో పాటు నాలుగేళ్ల కుమారుడు ఉండడం స్థానికంగా అందర్నీ కలిచివేసింది. ప్రమాదంలో ఒరిస్సాకు చెందిన తిరుపతి మాజీ (22), శంకర్ (20), రాజు (25), ఖుషి, ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన రాము యాదవ్ (34), గీత (32), హిమాన్షు (4) మృతి చెందారు. సదరు నిర్మాణ సంస్థ చుట్టూ నిర్మించిన ఈ ప్రహరీ గోడ నాణ్యత లేకపోవడంతో వర్షపు ధాటికి కుప్ప కూలింది. ప్రమాదంపై సమాచారం అందుకున్న కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, బాచుపల్లి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకుని కేసు నమోదు చేసి నిందితుల్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

పూర్తి వివరాలు మెయిన్ పేజీలో..

## 1969 తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ననుమాస స్వామి

సైఫాబాద్, మే 8 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1969లో పోరాడి జైలు జీవితాన్ని గడిపిన ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి అదుకోవాలని తెలంగాణ పోరాట యోధుల సంఘం (టిఎండిఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది, ప్రొఫెసర్ ననుమాసస్వామి కోరారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కా ంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ కారులకు పెన్షన్‌లు అందిస్తామని ప్రకటించిన నేపథ్యంలో హర్షం వ్యక్తం చేస్తూ లోక్‌సభ ఎన్నికల్లో కా ంగ్రెస్ పార్టీకి బేషరుతుగా మద్దతు ఇస్తున్నామని చెప్పారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశం కోసం ఇందిరాగాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలు చేసిందని, రాజీవ్‌గాంధీ కుమారుడు, కుమార్తె తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమం కోసం తెలంగాణ యోధుల డిక్లరేషన్ ప్రకటించి, మా సంక్షేమానికి పాల్పడు తున్న కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చేందుకు తమ సంఘం నిర్ణయించిందన్నారు. గత బిజెపి, బిఆర్ఎస్ ప్రభుత్వాలు తొలిదశ తెలంగాణ ఉద్యమకారుల పెన్షన్ కోసం ఏలాంటి చర్యలు చేపట్టలేదని, కాని నకిలీ ఉద్యమ కారుల ను సృష్టించి పదవులు, అవార్డులను అందించి, జైలుపాలైన సమర యోధులనున అన్యాయం చేశారని ఆయన ఆరోపించారు.

ఉద్యమకారుల డిమాండ్లను పరిష్కరిస్తామన్న కాంగ్రెస్ పార్టీకి 1969 ఉద్యమ కారులు, వారి కుటుంబాలు మూకుమ్మడిగా ఓట్లు వేసి గెలిపిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎలపాటి రామిరెడ్డి, బాలబోయిన సోమయ్య, కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, చందుల కృష్ణమూర్తి, సి.మురళీధర్, వడ్డె లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## కళాసుబ్బారావు ఎందరో ఔత్సాహిక కళాకారులకు సాంస్కృతికరంగ ఆప్తుడు

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్



శ్రీరామచంద్రరావుకు 'కళాసుబ్బారావు స్మారక నాటక పురస్కారం ప్రదానం చేస్తున్న కొలకలూరి ఇనాక్, చిత్రంలో జనార్ధనమూర్తి తదితరులు

హైదరాబాద్, మే 8 ప్రభాతవార్త: కళాసుబ్బారావు ఎందరో ఔత్సాహికుల కళాకారులకు సాంస్కృతికరంగ ఆప్తుడు అని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కోలకలూరి ఇనాక్ అన్నారు. బుధవారం లలిత కళాప్రపూర్ణ, త్యాగరాయ గానసభ వ్యవస్థాకులు, పూర్వ అధ్యక్షుడు కళాసుబ్బారావు జయంతి సందర్భంగా 'కళాసుబ్బారావు స్మారక నాటక పురస్కారం ప్రదానోత్సవ సభ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన కళాసుబ్బారావు కళావేదికలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య కొలకలూరి ఇనాక్ పురస్కారాన్ని ప్రముఖ రంగస్థలనటుడు తుర్లపాటి శ్రీరామచంద్రరావుకు ప్రదానంచేసి ప్రసంగిం చారు. ఎందరో ఔత్సాహి కులకు కళాకారులకు త్యాగరాయ గానసభ వేదికను అందించి ప్రోత్సహించార న్నారు. సుబ్బారావు గానసభ వ్యవస్థీకరణలో ప్రధానపాత్ర పోషించి సుదీర్ఘకాలం అధ్యక్షుడిగా వివిధ కళా ప్రక్రియల కళాకారులకు తనవంతు సహకారం అందించారన్నారు. సామాజిక కార్యకర్తగా, వ్యాపార వేత్తగా జంటనగరాల్లో పేరు, ప్రఖ్యాతలు సంపాదించకున్నారని అన్నారు. కళా జనాజనార్ధనమూర్తి మాట్లాడుతూ తమ తండ్రి సుబ్బారావు పేరును పాడు చేయకుండా గానసభ వైభవాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జీవిఆర్ కల్చరల్ ఫౌండేషన్ చైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి, ప్రముఖ సినీ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రముఖ సంఘసేవకులు పిఎస్ఆర్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## నాటక రంగాన్ని పరిరక్షించుకోవాలి

చిక్కడపల్లి, మే 8 ప్రభాతవార్త: నాటకరంగాన్ని పరిరక్షించుకోవడంతో పాటు కళాకారులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ రంగస్థనటులు డి.నాగేందర్ అన్నారు. బుధవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో శివాని ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కళాకారులకు 'మయూరి అవార్డులు' ప్రదానోత్సవ కార్యక్రమం ప్రముఖ రంగస్థనటులు, దాసరి ప్రతిభారత్న అవార్డుగ్రహీత మొవ్వ దేవనాథ సూరి అధ్యక్షతన జరిగింది. వెన్నచెర్ల కళాకా రులు బంయక్ష గానము, శయన దృశ్యం, శ్రీకృష్ణరా యబారం నాటక ప్రదర్శన జరిగింది. సంగీ తాన్ని అడవి రా ములు అందించారు. శ్రీకృష్ణుడిగా బంగారు పెద్ద వెంకటయ్య, ధుర్యోధ నుడిగా జి.మణ్యం, అర్జు నుడుగా గట్టు ఆంజనేయులు అద్భుతంగా నటించింది.

## శిథిలావస్థలో ఉన్న గృహాలను సర్వే చేసి నివేదిక ఇవ్వండి

● అలసత్వం వహిస్తే అధికారులదే పూర్తి బాధ్యత
● టౌన్‌ప్లానింగ్ అధికారులతో జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్



హైదరాబాద్, మే 8,ప్రభాతవార్త: శిథిలావస్థలో ఉన్న గృహాలను సర్వే చేసి నివేదిక ఇవ్వాలని జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్‌కోస్ టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ టౌన్‌ప్లానింగ్ సిసిపితో కలిసి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులతో మాన్‌సూన్ ప్రిపరేషన్‌పై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వర్షాల కారణంగా ఎలాంటి ప్రమాద సంఘటనలు జరగకుండా ఉండేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. సర్కిల్ వారీగా శిథిలావస్థలో ఉన్ననిర్మాణాలను గుర్తించాలని వాటివిషయంలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్దంగా ఉన్న సెల్లార్‌లను గుర్తించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. శితిలావస్థలో ఉన్న నిర్మాణాలు, ప్రహరీ గోడలు, సెల్లార్‌ల తవ్వకం ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకునేలా సంబంధిత నిర్మాణదారులకు సూచించాలని అధికారులు చర్యలుతీసుకోవడంలో విఫలమయితే వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. తమ తమ సర్కిళ్ల పరిధిలో ప్రమాదాలు జరగకుండా తీసుకున్న చర్యలతోపాటు శిథిలావస్తకు చేరిన నిర్మాణాల పట్ల పూర్తి నివేదికను ఈనెల 18వ తేదీలోగా అందజేయాలని అధికారులను ఆదేశించారు. గత సంవత్సరంలో గుర్తించి, తీసుకున్న చర్యలు, ఈ సంవత్సరంలో గుర్తించి తీసుకోబోయే ముందస్తు చర్యలపై పూర్తి నివేదిక అందజేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ విషయంలో సిసిపి తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.

ఏయే ప్రాంతాల్లో ఎంత పంచాలి ? సన్నిహితులతో అభ్యర్థుల ఆరా..

"ఏయే ప్రాంతాల్లో ఎంత పంచాలనే దానిపై అభ్యర్థులు లెక్కలు వేస్తున్నారు. ప్రచారం అనంతరం రాత్రివేళ ప్రలోభాల పర్వంపైనే సన్నిహితులతో చర్చిస్తున్నారు. కొన్ని నియోజకవర్గాలో ఓటుకు రూ.500లు, మరికొన్ని నియోజకవర్గాల్లో ఓటుకు రూ.2వేలు వరకు ఇవ్వనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. పోటీగా భావించే అభ్యర్థి కంటే ఎక్కువే పంచేందుకు అభ్యర్థులు కసరత్తు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే బూత్‌లవారీగా చెల్లింపులు మొదలైనట్లు తెలిసింది. ప్రత్యర్థికంటే రూ.500 నుంచి వెయ్యి వరకు అధికంగా చెల్లించాలని భావిస్తున్నారు. ఇప్పటికే మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి బోడుప్పల్‌లోని కొన్ని డివిజన్‌లలో గల ఓటర్లకు డబ్బు పంపిణీ ప్రారంభించారు."



మొబైల్ నంబర్ల సేకరణపై దృష్టి

# ప్రలోభపర్వం మొదలు

ప్రభాతవార్త - హైదరాబాద్

ఇన్నాళ్లు ఒక ఎత్తు. ఈ నాలుగు రోజులు మరో ఎత్తు అన్నట్లుగా ఎన్నికల ప్రచారం మారింది. ఎన్నికల బరిలో ఉన్న నాయకులు ఓటర్లను తమ దారికి తెచ్చుకునేందుకు సర్వ శక్తులు ఒడ్డుతున్నారు. ప్రచారం తుది దశకు చేరుకున్న తరుణంలో ఫోల్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. బూత్‌ల వారీగా కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించి ఓట్ల మొబైల్ నెంబర్లు సేకరిస్తున్నారు. కొందరు అభ్యర్థులు ఇప్పటికే ఐవీఆర్ కాల్స్ ద్వారా ఓటర్లను పలకరిస్తున్నారు.

మొబైల్ నెంబర్ల సేకరణపై బిన్న ప్రచారాలు జరుగుతున్నాయి. యూపీఐ ద్వారా నగదు బదిలీ కోసమూ కొందరు వివరాలు తీసుకుంటున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నగదు పంపిణీ క్రమంలో ప్రత్యర్థి పార్టీలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, సర్వైలెన్స్ టీంలతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశమున్న దృష్ట్యా ఎలాంటి రిస్క్ లేకుండా ఆన్‌లైన్‌లో బదిలీ చేసే యోచనలో కొందరు అభ్యర్థులున్నట్లు తెలిసింది. ప్రధాన పార్టీకి చెందని కార్యకర్తలు పలు ప్రాంతాల్లో ఇప్పటికే రెండు మూడు పర్యాయాలు పర్యటించారు. ఓటు వేయాలనే విజ్ఞప్తి కంటే ఇంటింటికీ వెళ్ళి ఓటర్ల మొబైల్ నెంబర్ల సేకరణపై వారు ఎక్కువ దృష్టి సారించారు. యూపీఐ లావాదేవీలపైనా నిఘా ఉంటుందన్న ఎన్నికల అధికారుల హెచ్చరికల నేపథ్యంలో కొందరు అభ్యర్థులు జాగ్రత్త పడుతున్నట్లు తెలిసింది. ఒక నెంబర్ నుంచి ఎక్కువ మందికి డబ్బులు పంపడం కంటే వేర్వేరు వ్యక్తుల యూపీఐ ఖాతాల ద్వారా నగదు బదిలీకి చర్యలు తీసుకుంటున్నారు. పలు భవనాల్లో ఓటర్లకు సంబంధించి ఒకరిద్దరి నెంబర్లకు డబ్బులు పంపుతున్నారు. వారి ద్వారా ఆయా భవనాల్లోని కుటుంబాలకు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. మల్కాజ్‌గిరిలో ఓ పార్టీ నేత 10 కుటుంబాలుండే ఓ భవనంలోని ఓటర్ల కోసం ఒక వ్యక్తికి డబ్బులు పంపారు. కొందరు ఓటర్లకు నగదు అందకపోవడంతో వారు స్థానిక పార్టీ నేత దృష్టికి తీసుకెళ్ళారు. మరో మార్గంలో ఇంటింటి పంపిణీ కంటే బస్తీల నేతలు, కాలనీ సంఘాలు, ఆపార్ట్‌మెంట్ల అసోసియేషన్ల ద్వారా నగదు ఇచ్చేందుకు అభ్యర్థులు చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని ఏరియాల్లో స్థానికంగా గుర్తు పట్టని వ్యక్తుల ద్వారా పంపిణీ చేపడుతున్నారు. మొత్తంగా నగరంలో ప్రలోభ పర్వం ముందుగానే మొదలైంది. అయితే తమ దృష్టికి వస్తే మాత్రం చర్యలు తీసుకుంటామని ఎన్నికల అధికారులు హెచ్చరిస్తున్నారు. మిగతా సిటీ 2వ పేజీలో

## ఉప్పల్ స్టేడియంలో ఐపిఎల్ క్రికెట్ సందడి






ఉప్పల్‌లోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం జరిగిన సన్‌రైజర్స్, లక్నో మధ్య జరుగుతున్న ఐపిఎల్ ట్వంటీ మ్యాచ్‌లో సందడి వాతావరణం నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రేక్షకులు తరలివచ్చారు. సాయంత్రం ఆరు గంటల నుంచే స్టేడియం వద్ద సందడి వాతావరణం నెలకొంది. పాసులు ఉన్న పలువురు ప్రేక్షకులకు రెండు గంటల ముందే స్టేడియం వద్దకు తరలివచ్చారు. స్టేడియంకు వెళ్లే అన్ని రహదారుల వద్ద రద్దీ నెలకొంది. పలువురు సినీనటులు, క్రీడాకారులు మ్యాచ్ చూసేందుకు స్టేడియంకు వచ్చారు. వర్షం కారణంగా మ్యాచ్‌కు అంతరాయం ఏర్పడుతుందని హెచ్‌సిఏ వర్గాలు ఆందోళన చెందగా, ఎటువంటి ఇబ్బంది లేకుండా మ్యాచ్ నిర్వహించారు. అయితే మ్యాచ్ చూసేందుకు వచ్చే ప్రేక్షకులు పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో స్టేడియం చుట్టూ ఉన్న రహదారుల కిక్కిరిసి పోతున్నాయి. మ్యాచ్ జరిగిన ప్రతిసారి ఉప్పల్ పరిసర ప్రాంతవాసులకు చుక్కలు కనిపిస్తున్నాయి. మరోవైపు మంగళవారం రాత్రి కురిసిన వర్షం కారణంగా స్టేడియం గేట్ నెం.5 నుంచి 8 వరకు బురదమయంగా తయారైంది. (ప్రభాతవార్త - ఉప్పల్)

## రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

**మజ్దూర్ యూనియన్**




**దక్షిణ మధ్య రైల్వే గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో ప్రసంగిస్తున్న మజ్దూర్ యూనియన్ నేత శంకర్ రావ్ తదితరులు**

అడ్డగుట్ట, మే 8 ప్రభాతవార్త: రైల్వే కార్మికుల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సి.హెచ్.శంకర్ రావ్ పిలుపునిచ్చారు. ఎస్‌సిఆర్ ఎంయు గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం సికింద్రాబాద్‌లోని సెంట్రల్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. రైల్వే కార్మికుల హక్కులు, న్యాయమైన కోర్కెల సాధనకు మజ్దూర్ యూనియన్ నిరంతరం పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కె.శ్రీనివాస్, రీజినల్ కార్యదర్శి పి.రవిందర్, అధ్యక్షులు ఎస్.కె.ఖాజా బాబా, మజ్దూర్ యూనియన్ నాయకులు నాగేశ్వరావ్, అజీజ్, సుబ్బరామయ్య, మురళీ, కొమురయ్య, క్రిష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సారస్వత పరిషత్తు సాయం కళాశాలలో తెలుగు కోర్సుల్లో ప్రవేశాలు

నాంపల్లి, మే 8 ప్రభాతవార్త : బొగ్గులకుంట తిలక్‌రోడ్డులోని తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్య (సాయంత్ర) కళాశాలలో వివిధ తెలుగుకోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 1965లో ప్రారంభమైన ఈ కళాశాలలో తెలుగుభాషా సాహిత్యాలలో పీడిసి (ప్రీ డిగ్రీ) కోర్సు, బిఏ లాంగ్వేజెస్, ఎంఏ లాంగ్వేజెస్ కోర్సులు బోధించబడుతున్నాయి. ఈ కోర్సులు చదివిన వారు తెలుగు పండితులుగా, కళాశాలలు, విశ్వవిద్యాలయాల అధ్యాపకులుగా, అధికారులుగా, పాత్రికేయులుగా స్థిరపడ్డారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు రెండేళ్ల పీడిసి కోర్సులకు అర్హులు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు బిఏ లాంగ్వేజెస్‌లో డిగ్రీ ఆన్‌లైన సిస్థం (దోస్త్) ద్వారా ప్రవేశం పొందవచ్చు. తెలుగు ద్వితీయభాషగా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఎంఏ లాంగ్వేజెస్‌కు అర్హులు. ఆయా కోర్సుల పూర్తి వివరాలకు ప్రిన్సిపాల్ డా. సిల్మానాయక్‌ను సంప్రదించవచ్చునని ప్రాచ్య కళాశాల కరస్పాండెంట్, సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## దేశాభివృద్ధిలో మోడీ పాత్ర కీలకం

**బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గానుగపాటి సూర్యనారాయణశర్మ**

ముషీరాబాద్, మే8, ప్రభాతవార్త: దేశాభివృద్ధిలో మోడీ పాత్ర కీలకమైనదని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గానుగపాటి సూర్యనారాయణశర్మ స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ దేశ ప్రజలంతా మోడీవైపే ఉన్నారని, కేంద్రంలో బీజేపీనే ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. మోడీ తీసుకున్న ప్రతిష్ఠాత్మక నిర్ణయాలతో ప్రపంచ దేశాలలో భారత్‌కు ప్రత్యేక స్థానం ఏర్పడిందని, దీనిని కొనసాగించాలంటే మోడీ ప్రధానిగా ఉండాలని తెలిపారు. ఎవరి చేతిలో దేశం భద్రంగా ఉంటుందో మన దేశ ప్రజలకు తెలుసని, కుల మతాలకు అతీతంగా దేశ ప్రజలంతా మోడీని ఆదరిస్తున్నారని అన్నారు. ప్రపంచ దేశాలన్నీ మనదేశం వైపు చూడటానికి కారణం మోడీ అని, అటువంటి మోడీని ప్రజలందరూ మరోసారి ఆశీర్వదించి, మూడోసారి ప్రధానిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాబు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## తమిళసై సౌందర రాజన్‌ను సత్కరించిన జాట్ కోర్ కమిటీ నేతలు

ముషీరాబాద్, మే 8, ప్రభాతవార్త: తెలంగాణ మాజీ గవర్నర్ తమిళసై సౌందర రాజన్‌ను జర్నలిస్ట్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ నేతలు మర్యాద పూర్వకంగా కలిసి శాలివాతో సత్కరించారు. బుధవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని హోటల్ మారియట్‌లో జాట్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పగుడాకుల బాలస్వామి, జూలూరి రమేష్, నగర అధ్యక్షులు చిలుకూరి అఖిలేష్ తదితరులు తమిళ్‌సైకి జాట్ డైరీని అందచేసి, తెలంగాణ రాష్ట్రానికి ఆమె చేసిన సేవలు గుర్తు చేశారు. రాజ్‌భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చి, గవర్నర్ కార్యాలయాన్ని ప్రజలకు దగ్గర చేసిన గవర్నర్‌గా తమిళసై పేరు గడించారని కొనియాడారు. గవర్నర్ పదవి అనంతరం ప్రత్యక్ష రాజకీయాలలోకి వచ్చిన ఆమె రాజకీయ జీవితం ఉజ్వలంగా ఉండాలనీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తమిళ్‌సై మాట్లాడుతూ జాతీయ వాద జర్నలిస్టులుగా మీరంతా వృత్తిలో ఉన్నతంగా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాట్ రాష్ట్ర నాయకులు ప్రవీణ్, లక్ష్మీకాంత్, అనిల్, సత్యం, సిద్ధూ పాల్గొన్నారు.

## వర్షం నీటిని తొలగించిన జిహెచ్ఎంసి సిబ్బంది

**సహాయక చర్యలను పర్యవేక్షించిన డిప్యూటీ కమిషనర్**



**వర్షంపు నీటి తొలగింపును పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్**

అత్తాపూర్ మే 8,ప్రభాతవార్త : మంగళవారం కురిసిన భారీ వర్షానికి పలు చోట్ల వర్షంపు నీరు నిలిచి పోవడంతో సహాయక చర్యలు చేపట్టడం జరిగిందని రాజేంద్రనగ్ సర్కిల్ డిప్యూటి కమిషనర్ రవి కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని దుర్గానగర్, సాయిబాబా టెంపుల్, హుడా కలానీ, అత్తాపూర్, కాటేదాన్ తదితర ప్రాంతాల్లో నిలిచిపోయిన వర్షపు నీటి తొలిగింపును డిప్యూటి కమిషనర్ రవి కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా డిసి మాట్లాడుతూ... మంగళవారం కురిసిన వర్షానికి పలు చోట్ల వర్షం నీరు నిలిచిపోయిందని వాటి తొలిగింపునకు తమ సిబ్బంది వెంటనే సహాయక చర్యలు చేపట్టి నిటి తొలిగించడం జరిగిందని తెలిపారు. వర్షాలు పడినప్పుడు ప్రజలు రోడ్డుపై జాగ్రత్తగా నడవాలని సూచించారు. రోడ్లపై నిలిచిన నిటిని పూర్తిగా తొలిగించి ప్రజల రాకపోకలకు ఇబ్బందులను తొలిగించడం జరిగిందని పేర్కొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులు అమావాస్య రోజు పనులు ఆపెయ్యాలి




**హెచ్ఎఫ్‌నగర్ సెంట్రింగ్ కాంట్రాక్టర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద గుర్తింపు కార్డులను అందజేస్తున్న అసోసియేషన్ అధ్యక్షులు మహ్మద్ హైమద్**

యూసుఫ్‌గూడ, మే 8, ప్రభాతవార్త : భవన నిర్మాణ కార్మికులు విధిగా అమావాస్య రోజు పనులు ఆపివేయాలని సెంట్రింగ్ కాంట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎమ్‌డి హైమద్ అన్నారు. బుధవారం రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎఫ్‌నగర్ సెంట్రింగ్ కాంట్రాక్టర్ అసోసియేషన్ కార్యాలంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అసోసియేషన్ సభ్యులకు కార్డులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఎఫ్‌నగర్ సెంట్రింగ్ కాంట్రాక్టర్ అసోసియేషన్ కార్యాలయానికి స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా ప్రమాదవశాత్తు ఎవరైన కార్మికుడు మరణిస్తే వారికి ఎఫ్ఐఆర్ అయితే 10లక్షలు ప్రభుత్వం తరపున అందజేయాలన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం తరపున ప్రమాదాలు జరిగినపుడు ఎలాంటి లబ్ది పొందడం లేదని వారిని కూడా పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం తరపున సహాయం అందేలా చూడాలని కోరారు. ఈకార్యక్రమంలో సయ్యద్ ఫారుక్, ఇంతియాజ్, గురువయ్య, వెంకటేష్, రహీమ్, కొలన్‌కృష్ణ, రమేష్ నాయక్, శివాజి, దీమయ్య, రవి, శంకర్, భరత్, సంఘమేష్, పాల్గొన్నారు.

## ప్రలోభపర్వం మొదలు

**మొదటిపేజీ తరువాయి..**

వివిధ జిల్లాలకు హైదరాబాద్ నుంచి డబ్బు తరలించే అవకాశాలున్నాయనే అనుమానాలతో మూడు కమీషనరేట్లు పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి జిహెచ్ఎంసి పరిధిలో 22.50 కోట్ల రూపాయలను పట్టుకు న్నారు. అలాగే 17.93 కోట్ల విలువ గల ఇతర వస్తువులు, 26.832 లీటర్ల మద్యాన్ని పట్టుకొని సీజ్ చేశారు. అక్రమ మద్యం అరికట్టడంలో భాగంగా 297 మందిపై కేసులు నమోదు చేసి 294 మందిని అరెస్టు చేశారు. ఎన్నికలకు ముందున్న ఈ మూడు రోజుల్లో నిఘా పెంచి డబ్బు, మద్యం తరలింపురకు కళ్లెం వేయడానికి సిద్ధమయ్యారు. చెక్‌పోస్టల సంఖ్యను పెంచారు. మూడు కమీషనరేట్లలోనూ అనుమానిత కేంద్రాలు, బస్తీలు, జిల్లా సరిహద్దుల వద్ద మరింత బందోబస్తు చేపట్టారు. రూట్‌లో వెళ్ళే వాహనాలన్నీ చెక్‌చేసేలా సిబ్బందిని అప్రమత్తం చేశారు.




## అమిత్‌షా పేక్ వీడియో కేసు సిఎం కార్యాలయం వరకు వస్తుంది

హైదరాబాద్, మే 8 ప్రభాతవార్త: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాపై ఫెక్ వీడియో కేసు సిఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం వరకు వస్తుందని, ఈ కేసులో ఇప్పటికే పలువురు వ్యక్తులన అరెస్టు చేయడం జరిగిందని, ఇంకా కేసు లోతుగా దర్యాప్తు జరుగుతున్నదని బిజెపి యువ మోర్చా జాతీయ అధ్యక్షుడు తేజసిసూర్య సంచలనమైన వ్యాఖ్యలు చేశారు. బిజెపి అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మికి చెందిన విబి ఫౌండేషన్ ఆధ్వర్యంలో లెట్స్ ఓటీ క్యాంపెయిన్ పేరుతో నారాయణ గూడలోని కేశవ మెమోరియల్ కళాశాల మైదానంలో మ్యూజికల్ ప్రోగ్రాం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న తేజస్విసూర్య మాట్లాడుతూ తెలంగాణలో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి 16 సీట్లు విజయం సాధిస్తుందని, దక్షిణ భారతదేశంలో కొత్త రికార్డు సృష్టిస్తుందన్నారు.

## అన్నదానం చేస్తే పుణ్యం : చొల్లేటి




**5వ వార్డు కాకగూడలో అన్నదానం చేస్తున్న చొల్లేటి రమేశ్**

కంటోన్మెంట్, మే 8 ప్రభాతవార్త: ఆకలి మంటలతో అలమటిస్తున్న పేదలకు అన్నదానం చేస్తే పుణ్యం కలుగుతుందని సుబ్రమణ్య స్వామి దేవాలయం ట్రస్ట్ బోర్డుమెంబర్ చొల్లేటిరమేష్ తెలిపారు. అమావాస్యను పురస్కరించుకొని బుధవారం కంటోన్మెంట్ కాకగూడ, ప్రియా కాలనీ, ఫేస్ -2లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి నెల అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు మన్నెం రమేశ్, నీలకంటి ప్రవీణ్, పూసల మధుసూదన్, పబ్బ లక్ష్మణ్, బొమ్మెర్ల రాజేశ్, ఎస్.ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## గోవులకు గడ్డి వేసిన భజరంగ్‌సేనా ప్రతినిధులు



బేగంబజార్, మే 8 ప్రభాతవార్త: తెలంగాణ భజరంగ్‌సేనా ఆధ్వర్యంలో అమావాస్యను పురస్కరించుకుని బుధవారం ఇమ్లీబన్‌లోని గోశాలలో గోవులకు ప్రత్యేకపూజలు చేసి గడ్డివేశారు. ఈసందర్భంగా సేనా అధ్యక్షులు ఎన్.ఆర్ లక్ష్మన్‌రావుగుప్త మాట్లాడుతూ గోవులను రక్షించాల్సిన అవసరం, భాద్యత ఎంతైనా ఉందన్నారు. ఈకార్యక్రమంలో సేనా ప్రతినిధులు వినయ్‌తివారి, ఎర్రంశ్రీనివాస్, సునీల్ అగర్వాల్, నరేష్, రాజారాం, మనోజ్ పాల్గొన్నారు.

## మహాకాళీ ఆలయంలో రుద్రహోమం



**అమావాస్య సందర్భంగా మహాకాళీ ఆలయంలో రుద్రహోమం నిర్వహిస్తున్న దృశ్యం**

బేగంపేట, మే 8, ప్రభాతవార్త : సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో అమావాస్య సందర్భంగా రుద్రహోమాన్ని నిర్వహించారు. ప్రతి అమావాస్యకు ఆలయంలో హోమం నిర్వహిస్తుంటారు. అలాగే బుధవారం కూడా రుద్రహోమాన్ని నిర్వహించారు. ఈ హోమంలో ఆలయ ఈ ఓ మనోహర్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈహోమం కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మ వారి ఆశీస్సులు ప్రజలందరికీ లభించాలని ఆలయ ఈఓ అమ్మవారిని కోరుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేసారు.

## భూదాన పోరాట యోధులకు గుర్తింపుకు స్మారక భవనాన్ని నిర్మించాలి

సైఫాబాద్, మే 8 ప్రభాతవార్త: తెలంగాణ భూదాన యోధులు, సాయుధ పోరాట యోధుల చరిత్రను భావి తరాలకు తెలియజేసేందుకు వారి స్మారకాన్ని, విగ్రహాలను ఏర్పాటు చేయాలని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో రెండు ఎకరాల భూమిని కేటాయించాలని పలువురు వక్తలు కోరారు. వారి చరిత్రను పాఠ్య పుస్తకాల్లో ముద్రించాలని, ప్రస్తుతం పాలకులు, రాజకీయ పార్టీల నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం తెలంగాణ సాయుధ పోరాట యోధులను, వారి చరిత్రను రాజకీయాల కోసం ఉపయోగించుకుంటున్నారని వక్తలు ఆరోపించారు. వారికి తగిన గుర్తింపు ఇవ్వడం లేదని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీభూదాన్ రామచంద్రారెడ్డి మెమోరియల్ ట్రస్ట్, ఆలిండియా సర్వసేవా సంఘ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ పరోపకారులు, వీరులు, వీరవనితల సంస్మరణ, వారి వారసుల సన్మాన సభ జరిగింది. ఈ సభలో ఆలిండియా సర్వసేవా సంఘ్ జాతీయ ట్రస్టీ, తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షుడు తొలుపునూరి కృష్ణాగౌడ్ అధ్యక్షత వహించగా మగ్ధూం మొహియుద్దీన్ కుమారుడు జాఫర్ మొహియుద్దీన్, చాకలి ఐలమ్మ మనుమడు చిట్యాల రామచంద్రం, ఆరుట్ల కమలాదేవి మనుమడు ఆరుట్ల శ్రీకాంత్‌రెడ్డి, భీంరెడ్డి నరసింహారెడ్డి కుమారుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులను ఆల్ ఇండియా సర్వ సేవా సంఘ్ జాతీయ అధ్యక్షుడు భూదాన్ రామచంద్రారెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ సభలో వెదిరె అరవింద్‌రెడ్డి ప్రసంగిస్తూ భూదాన్ రామచంద్రారెడ్డి, రావి నారాయణరెడ్డి, భీంరెడ్డి నరసింహారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, మగ్దూం మొహియుద్దీన్, చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, సురవరం ప్రతాప్‌రెడ్డి తదితర పోరాట యోధుల వారసులతో ఒక ఫోరంను ఏర్పాటు చేసి తెలంగాణ సాయుధ పోరాట యోధుల చరిత్రను భావి తరాలకు అందించేందుకు అవసరమైన చర్యలను రాష్ట్ర ప్రభుత్వానికి సూచిస్తామన్నారు.




**భూదాన పోరాట, సాయుధ పోరాట యోధుల వారసులకు సన్మానం**

## ఇండియా కూటమికే బిసి సంఘాల మద్దతు

**జాతీయ బిసిదళ్ అధ్యక్షుడు కుమారస్వామి**

నాంపల్లి, మే 8 ప్రభాతవార్త : కులగణన చేపట్టి దేశంలోని సంపద సమాజంలోని అన్నివర్గాలకు న్యాయబద్ధంగా అందించాలని, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని, రిజర్వేషన్లపై ఉన్న 50శాతం పరిమితిని ఎత్తివేయాలని నిర్ణయించిన కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమికే జాతీయస్థాయిలో బిసి సంఘాలు సంపూర్ణ మద్ధతు ప్రకటిస్తున్నట్లు జాతీయ బిసిదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్ని బిసి సంఘాల నాయకులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఎన్నికలకు ముందిచ్చిన హామీలన్నీ అమలుచేస్తూ వెళుతోందని, ఆలాగే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమికి ఓటువేసి మరింత బలాన్ని చేకూరిస్తే దేశవ్యాప్తంగా అభివృద్ధి, న్యాయబద్ధమూనర ఫలాలు అందుకోవచ్చునని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బిసిల ఓట్లు కాంగ్రెస్ పార్టీకే దక్కుతాయని, రిజర్వేషన్ల వ్యతిరేక పార్టీలకు, బిసిలను విస్మరిస్తున్న పార్టీలకు వీరి ఓట్లను అడిగే హక్కేలేదని, ఓటు అనే ఆయుధంతో బుద్ధిచెప్పాలని కుమారస్వామి అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు, ప్రైవేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ ప్రైవేటీకరణ పేరుతో అండగా ఉంటూ నిరుపేద, బడుగు బలహీన వర్గాలకు జీవనోపాధికి గొడ్డలిపెట్టుగా తయారైందని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడం వల్ల దేశానికి ఎక్కువ నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యకపరిచారు. ఈ సమావేశంలో బిసి సంఘాల నాయకులు గాంధీనారాయణ, జ్వాల సత్యనారాయణ, మహేంద్రబాబు, వెంకటరమణ, రాజేష్‌యాదవ్, సాయి చరణ్ పాల్గొన్నారు.



**బిసి సంఘాల సమావేశంలో ప్రసంగిస్తున్న కుమారస్వామి, నారాయణ, మహేంద్రబాబు, సత్యనారాయణ తదితర అతిథులు**

## బాపూజీ నగర్‌లో అమావాస్య అన్నదానాలు



**1వ వార్డు బాపూజీ నగర్‌లో అన్నదానం చేస్తున్న జంపన ప్రతాప్**

కంటోన్మెంట్, మే 8 ప్రభాతవార్త: అమావాస్యను పురస్కరించుకొని బుధవారం కంటోన్మెంట్ బోయిన్‌పల్లి బాపూజీ నగర్‌లోని శ్రీ నల్లపోచమ్మ అలయంలోని నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ప్రారంభించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ కమిటీ నిర్వాహకులతో కలిసిసి అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ ముదిరాజ్, దుర్గయ్య, రామారావ్, అజిత్, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా జయనగర్ చౌరస్తాలోని నల్లపోచమ్మ దేవాలయం, చిన్నతోకట్టలోని కట్ట మైసమ్మ దేవాలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని జంపన ప్రారంభించారు.

## సాహిత్య సేవలను గుర్తించి పురస్కారాలను అందించడం విశేషం

చిక్కడపల్లి, మే 8 ప్రభాతవార్త: సాహిత్య సేవలను గుర్తించి పురస్కారాలను అందించడం సంతోషంగా ఉందని శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, ప్రముఖ కన్నడ కవి పి.ప్రదీప్‌కుమార్, బహుబాషా కవయిత్రి ప్రభాశాస్త్రి, జోష్యుల అన్నారు. కళావేదిక జాతీయ కల్చరల్ విభాగం డైరెక్టర్ దేబా విజయకుమార్ అన్నారు. అంతర్జాతీయ సాహిత్య, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక జాతీయ కల్చరల్ విభాగం డైరెక్టర్ దేబా విజయకుమార్‌కు 'జాతీయ సాధనశ్రీ' పురస్కారాన్ని అందించి గౌరవించే కార్యక్రమం బుధవారం జరిగింది. సాంస్కృతిక, సాహిత్యరంగానికి విశేషంగా సేవలందంచిన వారిని గర్తించి పురస్కారాలను అందించడం గౌరవంగా ఉందన్నారు. కళాకారులను సంస్థలు గుర్తించి ప్రోత్సహించడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కమిటీ సభ్యులు కొల్లి రమావతి, ఈశ్వరీభూషణం, చిట్టెలలిత, గుత్తా హరి సర్వోత్తమ నాయుడు, భాగ్యలక్ష్మి కట్టా, డాక్టర్ టి.పార్ధసారథి, ఎర్రా సతీష్, రాజేంద్రప్రసాద్, నల్లా భాగ్యలక్ష్మి, శ్రీనుబాబు, సంపత్ కుమార్, అరుణ్‌కుమార్, బాలార్జున, ఓ.కోయిలా నవీన్, కరుణాకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు, స్నేహితులు, బంధువులు పాల్గొన్నారు.

## పి.వి.స్మారక అవార్డును దలైలామకు ప్రదానం



**దలైలామకు పి.వి.స్మారక అవార్డును ప్రదానం చేస్తున్న మణిందర్‌జిత్‌సింగ్ బిట్టా, చిత్రంలో పి.వి.కశ్యప్, అనిల్‌కుమార్**

సైఫాబాద్, మే 8 ప్రభాతవార్త: భారతరత్న, మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక 'పి.వి.నరసింహారావు మెమోరియల్ అవార్డు'ను ప్రపంచ శాంతి దూత దలైలామాకు ప్రదానం చేయడం జరిగింది. న్యూఢిల్లీలోగల ధర్మశాలలోని నివాసంలో బుధవారం ఉదయం వైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఈ అవార్డును ఆయనకు ఆల్ ఇండియా యాంటి టెర్రరిస్ట్ ఫ్రంట్ చైర్మన్ మణిందర్‌జిత్ సింగ్ బిట్టా, పివి మనవడు పివి కశ్యప్, హైదరాబాద్‌కు చెందిన సివిల్ సర్వీసెస్ ర్యాంకర్, సిఎస్‌బి ఐఎఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత, మల్లవరపు, పి.వి.ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పివి స్మారక అవార్డును అందుకున్నందుకు దలైలామా హర్షం వ్యక్తం చేశారు. శాంతి ద్వారానే ప్రపంచం మనుగడ సాధ్యం కాలగలదని, పివి ప్రపంచ శాంతి కోసం చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. పి.వి. అడుగుజాడల్లోనే ప్రజలు, నాయకులు నడవాల్సిన అవసరం ఉందని బిట్టా సూచించారు.




Government of Telangana District Industries centre, Karimnagar
**THE TELANGANA REGIONAL MICRO AND SMALL ENTERPRISES FACILITATION COUNCIL AT KARIMNAGAR**
**[Establishment pursuant to section 20 of MSMED Act, 27 of 2006 ref no 1076/MSEFC/2022 Dated 19-04-2024]**
**NOTICE**

M/s SAMARTH ENGINEERS, 1-4-879/80/C&D, Flat No 102 Pradeep Apartments, St No 8 Bakaram, Gandhinagar, Hyderabad - 500080. Telangana state. .... Claimant

Vs

M/s TELANGANA PHARMA TECH, Office at :- Plot No P2, Opp Hyundai service centre, IDA Uppal, Hyderabad - 500039 ...Respondent

To,
M/s TELANGANA PHARMA TECH Office at :- Plot No P2, Opp Hyundai service centre, IDA Uppal, Hyderabad - 500039.

Take notice that the Arbitration Under section 18[3] of MSMED Act 27 of 2006 proposed to be held on 15-05-2024 at 11:30 AM in the chamber of General Manager, District industries centre, Opp Karimnagar Milk Dairy, Padmanagar, Karimnagar district, your appearance in person or by a duly authorized representative is required at the aforesaid time and date.

Further the respondent has not paid the fee of Rs. 1,500/- [ Demand draft only]. The claimant is advised to pay the amount in favour of The chairman MSEFC Ranga Reddy Region for further proceedings. If you fail or omit to make an appearance, the council will continue the proceeding and pass an award on the evidence before it. The confirmation of participation may be acknowledged through email to gmdic.krmr.inds@telangana.gov.in

Sd/- CHAIRMAN MSEFC KARIMNAGAR REGION

**PUBLIC NOTICE**

The General Public are hereby informed that my client Smt. NAGIREDDY JYOTHI, D/o. LATE N BIKSHAM REDDY, aged about 27 years, Occupation: Software Engineering, R/o. H.No.7-0, Patha Chilukuru Near Ramalayam Temple, Chilukuru Village & Mandal, Nalgonda District-508 206, has entered into Sub agreement of Sale dated 29-04-2024 with Sri. MADDI PRAVEEN KUMAR REDDY, S/o. M. BHUPAL REDDY, aged about 48 years, Occupation: Business, R/o. H.No.3-8-484, Prashanth Nagar, Chintalakunta, L.B. Nagar, Ranga Reddy District- 500074. (Vendor/ Agreement holder ) for the purchase of all that the Piece and Parcel of the open land bearing Plot No.68, admeasuring 150 Sq. Yards or 125.4 Sq. Mtrs, in Survey Nos.201, Situated at KUNTLOOR Village, Abdullapurmet Revenue Mandal, Ranga Reddy District, Under Pedda Amberpet Municipality, and bounded by: NORTH : Plot No.67, SOUTH : Plot No.69, EAST: 25ft Wide Road, WEST : Plot Nos. 63,. And paid the substantial amount towards advance sale consideration.

In case any person or persons have any right or interest in the above property or have any objection for sale of the above said property shall lodge their protest to the undersigned within 07 days from the date of publication of this notice, with all relevant documents in support of their claim failing which my client will complete the sale transaction and no claims shall be entertained thereafter. This is for the information of general public.

**JAKKULA UMAMAHESWAR RAO, Advocate**
H.No.8-480/A/1, Road No.1, Sai Priya Nagar, Medipalli Mandal, Parvathapur (V), Medchal- Malkajgiri 500098
**Cell Nos. 9030000804**

**IN THE COURT OF THE HON'BLE 1st SENIOR CIVIL JUDGE :CITY CIVIL COURT : AT: Hyderabad**
**0.S No. 203 OF 2024**

**Between:**
Smt. Champa Devi @ Champa And Others ... **Plaintiffs**
**AND**
LIC HFL and Others ... **Defendants**

To, All Concern ...**Defendant No. 3**

Whereas, the above named Plaintiffs have filed the above Suit seeking permission of the Hon'ble Court to declare the Plaintiffs as the legal heirs and successors of Late Jabara Ram S/o. Gunesha Ram @ Gunesh Ram @ Ganesha Ram @ Ganesh ram who died on 02-09-2018 with regard to immovable property i.e., All that 1/2 i.e., to say 50% unspecified and undivided share, right, title, interest in property bearing Municipal No. 4-1-11/B/4/1, 4-1-11/A/4/1(new), H. No. 4-1-11 (Old), consists of Ground and Two Upper Floors, on land admeasuring 171 square yards or 142.92 square meters, situated at Boggulkunta, Tilak Road, Hyderabad and bounded by North : Neighbours Property H. No. 4-1-11/a; South : Neighbours Property; East : Road; West : Hyderabad Club and consequential reliefs. The above said case is posted on 27-06-2024 for the objections and claims of All Concerned to appear before the above said Court on 27-06-2024 at 10.30 A. M and to submit objections/ claims along with producing all documents if any to before above Hon'ble Court. If no objection received, the Hon'ble Court will be heard and determined in absence all concerned and pass the Order/s as per law.

**// BY THE ORDER OF THE COURT//**
**M/s. SURENDER KUMAR AGARWAL Advocate**
# 4-4-101/1, 1ST Floor, Kokkonda Complex, Sultan Bazar, Hyderabad - 500 095 Telangana.
**Cell:09391107084**

**IN THE COURT OF XI JUNIOR CIVIL JUDGE : CITY CIVIL COURT : AT SECUNDERABAD**
**O.S. NO. 305 of 2024**

**Between:**
Smt. G. Bala Tripura Sundari And others **PLAINTIFFS**
**AND**
The Tahsildar, Marredpally and another **.. DEFENDANTS**

**TO**
All concerned

TAKE notice that Smt. G. Bala Tripura Sundari and others have filed the above suit seeking to declare them as the legal heirs of late Ganti Sankara Rao.

NOW the above case stands posted to 13.06.2024 for objections, if any. AS such if any person has got any objection in respect of the above matter, is required to be present before the Hon'ble Court on 13.06.2024 at 10.30 A.M. Otherwise the matter will be proceeded further.

**( BY ORDER OF THE COURT )**
**Sd/- G. SUDARSHAN REDDY ADVOCATE**
502, Tirumala Towers, Hyderguda, Hyderabad — 500 029
**Mobile : 98480 68286**

**IN THE COURT OF HON'BLE SENIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT AT: KUKATPALLY**
**I.P.NO 1 OF 2023**

**Between:**
Tandur Ramesh **Petitioner/Petitioner**
**AND**
Ch. Sai Vidyarthi & others **Respondents/Respondents**

**To,**
Ch. Rathna, w/o Ch. Bala Krishna Aged about : Major, Occ : Business C/o H. No. Plot No. 470,Siddiq Nagar, Road No. 10, Gachibowli, Ranga Reddy District 500 032 T.S. **Respondent No. 5,**

Please take Notice that the above I.P. No. 1 of 2023 in I.A. No. 1530 of 2023 in I.P.No. 1 of 2023 filed by the petitioner against you for insolvency petition and Injunction against both of you and the same is pending before the Hon'ble Senior Civil Judge, Ranga Reddy Dist at Kukatpally. The above Case is posted to 07-06-2024 and you are hereby called upon to appear in the court on that day at 10.30 AM either in person or through an Advocate. If you failed to attend the Court on that day the I.P. No. 1 of 2023 in I.A. No. 1530 of 2023 in I.P. of 2023 will be disposes as Ex-Party against you.

**// BY ORDER OF THE HON'BLE COURT//**
**M. Krishna Murthy Advocate**
M/s. INGENIOUS LAW GROUP
101 Shakti Sai Complex Chapel Road, Abids, Hyderabad.500001-
**8978997439.**

## భారీ వర్షాలకు విద్యుత్‌ఘాతానికి గురికాకుండా జాగ్రత్తలు పాటించండి : ఏఈ సందీప్ కుమార్

**యాచారం మే8,ప్రభాతవార్త :** ఎండ తీవ్రత వలన వేసవిలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న సందర్భంగా విద్యుత్ షాక్‌కు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని ఏఈ సందీప్ కుమార్ తెలిపారు. బుధవారం యాచారం మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ...అకాల వర్షాల కారణంగా విద్యుత్ వైర్లు తెగి విద్యుత్‌ఘాతానికి గురి అయ్యే అవకాశం ఉందని రైతులు రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు సామాన్య ప్రజలు జాగ్రత్త పాటించాలని సూచన చేశారు. ఈదురు గాలులకు తెగి నేలపై పడిన విద్యుత్ వైర్లను చేతిలో తాకరాదని ,విద్యుత్ స్తంబాలు విరిగిపడినట్లు వచ్చిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని ,విద్యుత్ లైన్ మాద చెట్ల కొమ్మలు పడితే మీరు తీయకూడదని విద్యుత్ శాఖ సిబ్బంది వచ్చాకే వాటిని తొలగించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. జాగ్రత్తలు పాటించపోతే ప్రాణానికి అపాయమని హెచ్చరించారు.

## ఓవర్ లోడ్‌తో సుద్ద టిప్పర్లు.. ధ్వంసం అవుతున్న రోడ్లు

**ధారూర్, మే 8, ప్రభాతవార్త:** అధిక లోడుతో వెళ్తున్న వాహనాలతో రోడ్లు , కల్వర్టులు ధ్వంసం అవుతున్నా పట్టించుకోవడంలేదని స్థానికులు పేర్కొం టున్నారు. వికారాబాద్ తాండూర్ ప్రధాన రహదారిలో సుద్ద టిపర్లు నిబంధ నలకు విరుద్ధంగా అధిక లోడుతో అతివేగం అజాగ్రత్తతో వస్తున్నా కూడా ఎవరు పట్టించుకోవడంలేదు. భారీ మట్టి, సుద్దను పేర్చుకుని దానిపై టర్పైన్ కట్టకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా వెళ్తున్నారు. సుద్ద పెళ్లలు రోడ్డుపై పడి తోటి ప్రయాణికులకు ఇబ్బందులే కాకుండా ప్రమాదాలు గురవుతున్నా సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. ప్రధాన రహదారిలోనే అనునిత్యం సుద్ధ తరలిస్తున్నా సంబంధింత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పం దించి నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో సుద్ద తరలిస్తున్న వాహనాలను తనిఖీ చేసి సంబంధిత యూజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వివిధ గ్రామాల ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.

## వాహనాల తనిఖీల్లో నగదు సీజ్

**దౌల్తాబాద్,మే 8,ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో దౌల్తాబాద్ మండలంలోని చంద్రకల్ గ్రామంలో అంతరాష్ట్ర సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ దగ్గర పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డ రూ.2,66,050 నగదు సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీశైలంయాదవ్ తెలిపారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తే తప్పనిసరిగా సంబంధిత పత్రాలను వెంట తీసుకురావాలన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై శ్రీశైలంయాదవ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావనియాదవ్

## వేసవిలో పిల్లలను ఆటపాటలలో ప్రోత్సహించాలి

**ఘట్‌కేసర్, మే 8, ప్రభాతవార్త:** వేసవిలో పిల్లలు బయటకు వెళ్లకుండా క్యాంపులో వివిధ ఆటపాటలను నేర్పించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నా రు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో బుధవారం ప్రేమ హస్తం ఫౌండేషన్ నిర్వహకురాలు దార్ల విజయ ఎలిజబెత్ ఆధ్వర్యంలో విబిఎస్ సమ్మర్‌క్యాంపును ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని యాదవ్, స్థానిక కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవిలు విచ్చేసి పిల్లల శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి సమ్మర్‌క్యాంపుల ద్వారా పిల్లలకు మంచి చెడు విషయాలను తెలియజేస్తూ ఆటపాటలలో ప్రోత్సహించాలన్నారు. పిల్లలను సెల్‌పోన్‌లకు దూరంగా ఉంచి పెద్దలను గౌరవించే విధానం, మర్యాద మాటలనుపై తెలియజేశారు. ఈసందర్భంగా తోలుబొమ్మల ప్రదర్శన, ఇంద్రజాల ప్రదర్శన తదితర కార్యక్రమాలను ప్రదరి ్శంచారు. ఈకార్యక్రమంలో సేవాభారత్ డైరెక్టర్ డాక్టర్ చిరంజీవి, డాక్టర్ కలమ చిరంజీవి, రేవ్ డాక్టర్ విజయ ఎలిజబెత్, పిల్లల తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

## 9 నుంచి ఇంటర్మీడియట్ మొదటి విడత అడ్మిషన్ల ప్రారంభం

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** ఇంటర్మీడియట్ మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియ మే 9 నుండి ప్రారంభమవుతున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి ఎన్.శంకర్ తెలిపారు. తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల షెడ్యూల్‌ను విడుదల చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా జూన్-1 నుండి తరగతులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. పదవ తరగి పాసైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గమనించాలని ఇంటర్మీడియట్ అడ్మిషన్లు పొందేందుకు సంబంధిత ధ్రువపత్రాలు సిద్ధం చేసుకుని అడ్మిషన్‌లు పొందాల్సిందిగా ఆయన తెలిపారు.

## పోస్టల్ బ్యాలెట్ ఓటు గడవు పొడిగింపు

### జిల్లా కలెక్టర్ ,ఎన్నికల అధికారి నారాయణ రెడ్డి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు మే 10 వరకు గడువును పొడిగించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ,ఎన్నికల అధికారి నారాయణ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటు ప్రక్రియ మే 8 తేది వరకు ముగుస్తున్నందున,రాష్ట్ర ఎన్ని కల కమిషన్ రెండు రోజుల పాటు సమయం పొడిగిస్తూ మే 10 వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసుకునేందుకు అవకాశం కల్పించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సదవకాశాన్ని పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కలెక్టర్ సూచించారు.

## ఈదురు గాలికి కూలిన పైకప్పు

### రోడ్డునపడ్డ కుటుంబం



పైకప్పు కూలిన ఇంటి వద్ద కుటుంబ సభ్యులు

**నవాబుపేట, మే 8 ప్రభాతవార్త :** మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలికి కొందరి ఇళ్ల పాక్షికంగా పాడయ్యాయి. ఈ నేపధ్యలో మండల పరిధిలోని ముభారక్ పూర్ గ్రామానికి చెందిన వడ్డె బుచ్చయ్యకు చెందిన ఇంటిపైకప్పు పూర్తిగాలని పోయింది. దీంతో కుటుంబం నిరాశ్రాయులైయ్యారు. ఇంటి మరమ్మతులకు ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరారు. పైకప్పు పూర్తిగా ధ్వంసం కావ డంతో నివాసం ఉండటానికి వీలులేకుండా పోయిందని వారి రోదిస్తూ చెప్పారు. ప్రభుత్వం ఆదుకో వాలని లేనిపక్షంలో ఎండకు ఎండుతూ వర్షానికి తడుస్తూ పిల్లలతో నివాసం ఉండాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## క్వారీ గుంతలో పడి మృతి చెందిన విద్యార్థి మృతదేహం లభ్యం

**ఘట్‌కేసర్ రూరల్, మే 8, ప్రభాత వార్త:** క్వారీ గుంతలో పడి నీట మునిగిన విద్యార్థి యశ్వంత్ ( 19 ) మృతదేహం లభ్యమైనట్లు పోచారం ఐటీసీ పోలీసులు బుధవారం తెలిపారు. పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నోజిగూడ ఔటర్ రింగ్‌రోడ్డు ప్రక్కన గల క్రషర్ గుంతలో సెల్ఫీ పోటో కొరకు మంగళవారం స్నేహితులతో కలిసి ప్రమాదవశాత్తూ వెళ్లి నీట మునిగిన బీటెక్ చదువుతున్న విద్యార్థి యశ్వంత్ మృతదేహన్ని పోలీసులు ఎట్టకేలకు కనుగొన్నట్లు తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్ బృందం సభ్యులు మొదటి రోజున ఎంత వెదకిన మృతదేహం లభ్యకాకపోవడంతో రెండో రోజు గాలింపు చర్యలు చేపట్టగా యశ్వంత్ మృతదేహన్ని వెలికితీసి పోలీసులు తెలిపారు. విద్యార్థి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడు నారపల్లిలో నివాసం ఉంటూ సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడిది ఏపీలోని ఏలూరువాసిగా పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోచారం ఐటీసీ పోలీసులు తెలిపారు.

# అకాల వర్షం.. అపారనష్టం



ఎదులాబాద్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, మే 8, ప్రభాతవార్త:** అకాల వర్షానికి తడిసిన వడ్లను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ మండలం మాదారం, ఎదులాబాద్ గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన బుధవారం పరిశీలించారు. మంగళవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి వడ్లు తడిసి రైతులు ఆందోళన చెందుతుండటంతో ఆయన చేరుకొని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత నెలరోజులుగా రైతులు వడ్లను ఎండబెట్టి ధాన్యం విక్రయించేందుకు ఎదురుచూస్తున్నారని వారం రోజుల క్రితం అధికారులు కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు. వర్షంతో వడ్లు తడిసి రైతులకు నష్టం జరిగిందని ప్రభుత్వం కొనుగోలు చేసే బాధ్యత తీసుకోవాలన్నారు. కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు ధాన్యం దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధికారులు రైతులకు కనీస సౌకర్యాలు కల్పించలేదని, క్వింటాల్‌కు 5 కిలోలు కోత విధిస్తున్నారని అసంతృప్తి వ ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులకు ఋుణమాఫీ చేయలేదని, ఎకరానికి రూ.500లు బోనస్ ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధపు హామీలతో గద్దెనెక్కి వాగ్దానాల అమలులో విఫలమయ్యారని దుయ్యబట్టారు. బిజెపి రైతుల పక్షాన ఉండి సమస్యలపై పోరాటం చేస్తుందని జిల్లా కలెక్టర్ స్పం దించి రైతులకు న్యాయం చేయాలని ఎంపిపి డిమాండ్ చేశారు.

బీభత్సం సృష్టించిన గాలివాన

### వెంకమ్మగూడలో వరికుప్పలు వర్షార్పణం

### మామిడి తోటలకు పంట చేలకు ఆపారనష్టం

**నందిగామ, మే 8 ప్రభాతవార్త :** నందిగామ మండలంలో మంగళవారం సాయంత్రం బీభత్సం సృష్టించిన అకాల వర్షం మామిడితోటలకు, పంట చేళ్లకు నష్టం కలిగించింది. గాలిదూమారానికి మామిడి తోటల్లో మామి డికా యలు పూర్తిగా నెలరాలయి. రంగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సల్వేంద్రిగూడలో ఉన్న అమానాన్న ఫామ్‌హౌస్ గార్డెన్లో ఉన్న మామిడి తోటలో గాలికి మామిడికాయలన్నీ రాలిపోయ్యాయి. వెంకమ్మగూడ శ్రీమల్లిఖార్జున స్వామి దేవాలయం ముందున్న పరుపు బండపై కల్లాలు చేస్తున్నట్లు బాధిత రైతులు బోరుమన్నారు. ఒకవైపు భీకరమైన గాలిదూ మారం దీనికితోడు వర్షం ఒక్కసారి బీభత్సం సృష్టించడంతో ఏమి చేయాలో తోచక రైతులు బోరుమన్నారు. ఏది ఏమైనా గాలివానకు చెట్లు విరిగి విద్యుత్ స్తంభాలు విరిగి ఫ్లెక్సీ బ్యానర్లు కటౌట్లు పడడమే కాకుండా తీవ్ర విద్యుత్ అంతరాయం ఏర్పడింది. మామిడి తోటల యజమానులకు పంటచేళ్ల రైతులకు నష్టం కలిగించింది. అకాల వర్షానికి నష్టపోయిన రైతు లను ప్రభుత్వం పరిశీలించి అన్ని విధాల ఆదుకోవాలని గ్రామీణ రైతులు మొరపెట్టుకుంటున్నారు.

### అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

**-కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి**

**యాచారం మే8,ప్రభాతవార్త :** గతరాత్రి అకాల వడగండ్ల వానతో నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆరుట్ల చెన్నారెడ్డి గూడ బండలేమూర్ గ్రామాల్లోని రైతుల పొలాల వద్దకు వెళ్లి వడగండ్ల వానతో ధ్వంసం అయిన ఆరుట్ల గ్రామానికి చెందిన రైతులు లచ్చగారి శేఖర్ రెడ్డి చిందం అడివయ్య చిందం శంకరయ్య,చిందం వెంకటయ్య,దండు జైపాల్ రెడ్డి భతవంత్ రెడ్డి,దండు జగాల్ రెడ్డి,చింతపల్లి కృష్ణా రెడ్డి,పుణ్యమూర్తి,మల్లయ్య ,వెంకట్ రెడ్డి,మైపాల్ రెడ్డి,మల్లయ్య,కావలి మారయ్య,శంకర్ ,కరుణాకర్ రెడ్డి,నర్సి రెడ్డిలకు చెందిన బొప్పాయి మామిడి వరి ఇతర కూరగాయల పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గత పది సంవత్సరాల కాలంలో అతివృష్టికి అనావృష్టికి నష్టపోయిన రైతులను బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడు ఆదుకునే పాపాన పోలేదని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రకృతి విపత్తులలో నష్టపోయిన రైతులకు న్యాయం చేసిందని ఇపుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తగిన నష్టపరిహారం చెల్లించి వారిని అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వింజమూరి రాంరెడ్డి, ఎంపిటిసిలు శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, పాక్స్ డైరెక్టర్లు వెదిరే హన్మంత్ రెడ్డి, వెంకటేష్, జంగయ్య యాదవ్, ఆరుట్ల గ్రామ అధ్యక్షుడు రావుల భాషయ్య, అనంగళ్ల యాదయ్య, కావలి బుగ్గరాములు, ముచ్చర్ల వెంకటేష్, చంద్రయ్య, మాసయ్య గౌడ్, సురేష్, ఎల్లేష్, రాజు, సురేష్, జంగయ్యగౌడ్, రమణారెడ్డి, హన్మంత్ రెడ్డి, విప్పరి కుమార్, కిషన్ నాయక్, లాలూ నాయక్, పకీరా చిందం ఐలయ్య, చిందం శ్రీశైలం చేరుకు నర్సింహ, కృష్ణ, అనిల్ రాజు, లచ్చగారి జంగారెడ్డి, బుగ్గరాములు, శిశుపాల్ రెడ్డి, శ్రీను, జగన్, లక్ష్మీకాంత్ రెడ్డి, పెద్దిరెడ్డి యాదగిరి రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.



వర్షానికి రాలిన మామిడి కాయలు

## ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

## ధాన్యం కేంద్రాల్లో కనీస వసతులు కరవు : ఎంపిపి

### కురిసిన అకాల వర్షం.. రాలిపోయిన మామిడి

**జిల్లెడు చౌదరిగూడ, మే 8,(ప్రభాతవార్త):** అకాల వర్షం కురవడం వల్లన జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. అలాగే చేతికొచ్చిన వరి పంటల కోతలకు అడ్డంకులు తలెత్తయి. మండలంలో మొత్తం 10ఎకరాల్లో మామిడి కాయలు నేల రాలినట్లు ఏఓ కృష్ణమోహన్ తెలిపారు. ఎలాంటి ఆస్థినష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. నష్ట పోయిన రైతులకు పంట నష్టపరిహారం అందించాలని మండల వాసులు, రైతులు కోరుతున్నారు.



వెంకమ్మగూడలో వర్షపు దాటికి తడిసిపోయిన వరికుప్పలు



నష్టాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# రోడ్‌షోలో ఎదురుపడిన బిజెపి, కాంగ్రెస్



ఎదురుపడి వాగ్వాదానికి దిగిన బిజెపి, కాంగ్రెస్ పార్టీల నాయకులు

## కార్యకర్తల మధ్య తోపులాట

## పోటాపోటీగా కార్యకర్తల నినాదాలు

**కేశంపేట, మే 8, ప్రభాతవార్త:** కేశంపేట మండల కేంద్రంలోని హోరాహోరీగా బిజెపి కాంగ్రెస్ ప్రచారాలు సాగాయి. బుధవారం కేశంపేట మండల కేంద్రంలో ఒకేసారి బిజెపి కాంగ్రెస్ ప్రచారాలు ఎదురెదురు పడడంతో కార్యకర్తల మధ్యలో కొంతసేపు తోపులాట జరిగింది. ఓవైపు బిజెపి అభ్యర్థి,అందే బాబయ్య శ్రీవర్ధన్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థివంశీచందర్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారు. కేశంపేట మండల కేంద్రంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరు వర్గాల పార్టీల నాయకులు ఎదురెదురు పడడంతో కార్యకర్తల మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. ఒకరిని చూసి మరొకరు పోటాపోటీగా నినాదాలు చేశారు. బిజెపి కార్యకర్తలు భారత్ మాతాకి జై అంటే జైజై కాంగ్రెస్ కాంగ్రెస్ అంటూ కాంగ్రెస్ కార్యకర్తలు పోటాపోటీగా నినాదలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి తదితర నేతలు కేశంపేట మండల కేంద్రంలో వంశీచందర్‌రెడ్డి వెంట ప్రచారం చేస్తున్నరు. అదే సమయంలో డీ అరుణ రోడ్డు షో అదే ప్రాంతానికి చేరుకుంది. మండల కే ంద్రంలో అంబేద్కర్ సర్కిల్లో ఇరువర్గాల కార్యకర్తలు నాయకులు ఒకే చోట చేరడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రస్తుతం పోలీసులు కూడా రంగ ప్రవేశం చేశారు. అరువర్గాలను సముదాయించి పక్కకు తప్పించారు.

**ఎస్సై లింగంను వివరణ కోరగా ..**

ఈ సందర్భంగా కేశంపేట ఎస్సై లింగం మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనుల జరగలేదని కొంత ఉద్రిక్త వాతావరణం ఏర్పడిందని పోలీసులు తమ సిబ్బందితో ఇరువర్గాలకు సర్ది చెప్పి అక్కడి నుంచి వారిని పంపించామని ఎస్సై లింగం తెలిపారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పార్టీల ప్రతినిధులు సహకరించాలి

### జిల్లా కలెక్టర్ ,ఎన్నికల అధికారి నారాయణ రెడ్డి



ఈవీఎంల గిడ్డంగి ఆవరణలో కలెక్టర్,వివిధ పార్టీల ప్రతినిధులు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్,ఎన్నికల అధికారి నారాయణరెడ్డి కోరారు. బుధవారం వికారాబాద్ మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని ఈవీఎంల గిడ్డంగిలో గల వివిప్యాట్,బ్యాలెట్ యూనిట్,కంట్రోల్ యూనిట్లను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నియోజకవర్గాల వారీగా కేటాయించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వివిధ నియోజకవర్గాల అవసరాల నిమిత్తం వికారాబాద్‌కు 12 బియులు,14 సియులు, 6వివి ప్యాట్‌లు కేటాయించగా ,పరిగి నియోజకవర్గానికి 13 బి.యులు,20 సియులు,14 వివిప్యాట్‌లు,తాండూరు 12 బియులు,19 సియులు, 8వివి ప్యాట్‌లు కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా కొడంగల్ నియోజకవర్గానికి 07 బియులు,11సియులు,3 వివి ప్యాట్‌ల చొప్పున కేటాయించి ఆయా నియోజకవర్గాలకు సరఫరా చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వివిప్యాట్,బ్యాలెట్ యూనిట్,కంట్రోల్ యూనిట్ల కేటాయింపు కార్యక్రమంలో అసిసెనంట్ కలెక్టర్ ఉమా హారతి ,ఈవీఎంల నోడల్ అధికారి సుగుణ భాయ్,ఎన్నికల విభాగం సూపరిం టెండెంట్ శ్రీనివాస్,డిప్యూటి తహసీల్దార్,నరసింహా రెడ్డి,వివిధ పార్టీల ప్రతినిధులు,పాల్గొన్నారు.

## సమస్యాత్మక గ్రామాలను సందర్శించిన డిఎస్‌పి

**మర్పల్లి, మే 8 ప్రభాతవార్త :** పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మర్పల్లిలోని సమస్యాత్మక గ్రామాలైన మర్పల్లి, పట్లూర్, సిరిపురం, గ్రామాలను వికారాబాద్ డిఎస్పీ శ్రీనివాప్‌రెడ్డి,సి.ఐ ఆంజనేయులు బుధవారం సందర్శించి గ్రామపప్రజలకు పలు సూచనలు చేశారు. మర్పల్లి యస్ఐ శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



పోలింగ్ బూతులను పరిశీలిస్తున్న డిఎస్‌పి

## పోలింగ్ సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

### జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వికారాబాద్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి,జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం మేరీ ఏ నాట్ పాఠశాలలో పార్లమెంటరీ ఎన్నికల దృష్ట్యా వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ కేంద్రాలు,ఫెసిలిటేషన్ కేంద్రాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు,సౌకర్యాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ రిటర్నింగ్ అధికారి రాహుల్ శర్మ మాట్లాడుతూ...పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి మౌలిక సౌకర్యాల కల్పనతో పాటు పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు సమకూర్చుకోవాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు నీటి సౌకర్యం ,వీల్‌చైర్ల,నిరంతర విద్యుత్తు,ఫ్యాన్లు ఉండేవిధంగా ఏర్పాట్లను చేపట్టాలన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకునేందుకు రెండు రోజుల సమయం పొడిగించడం జరిగిందని మే నెల 10వ తేది వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసుకునే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఇప్పటికి ఓటు వేసుకొని పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు సమాచారాన్ని చేరవేసి ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా ప్రత్యేక చొరవ చూపాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకా దేవి,షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి మల్లేశం,పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమేష్,ముఖ్యప్రణాళిక అధికారి అశోక్,జిల్లా లైబ్రరీ కార్యదర్శి సురేష్ బాబు,సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

## బిఆర్ఎస్‌కు కొత్త మధుసూదన్‌రెడ్డి గుడ్‌బై



కొత్త మధుసూదన్‌రెడ్డికి కాంగ్రెస్ కండువా వేస్తున్న తీగల కృష్ణారెడ్డి

**సరూర్‌నగర్, మే 8 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడకు చెందిన సీనియర్ బిఆర్ఎస్ నాయకుడు, 41వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ కొత్త మధుసూదన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నుండి బహిష్కృత నేత, బిఎస్‌పి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇటీవల ఆ పార్టీకి సైతం రాజీనామా చేసిన కొత్త మనోహర్‌రెడ్డికి స్వయానా సోదరుడైన మధుసూదన్‌రెడ్డి బుధవారం మీర్‌పేట్ మేడిబౌలిలోని టికెఆర్ క్యాంపు కార్యాలయంలో మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సమక్షంలో హస్తం గూటికి చేరారు. జిల్లెలగూడ మాజీ ఎంపిటిసి సిద్దాల దశరథ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన ఆయనకు తీగల మూడు రంగుల కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.

**యువ నేత సిద్దాల జగదీశ్ కురమ సైతం చేరిక...** జిల్లెలగూడకు చెందిన యువ నాయకుడు సిద్దాల జగదీశ్ సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రంగారెడ్డి జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు సిద్దాల దశరథ కుమారుడైన జగదీశ్ మధుసూదన్‌రెడ్డితోపాటు హస్తం తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు జగదీశ్‌కు పార్టీ కండువా వేసి తీగల ఆహ్వానించారు. ఈ సందర్భంగా తీగల మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరికలను స్వాగతిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దా పవన్‌కుమార్, సిద్దాల బాలప్ప, నాయకులు కీసర యాదిరెడ్డి, దాసరి యాదయ్య, మీర్‌పేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లు పద్మారెడ్డి, పద్మశ్రీలు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ కార్పొరేటర్ మమత బిజెపిలో చేరిక



కార్పొరేటర్ మమతకు కాషాయ కండువా వేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**సరూర్‌నగర్, మే 7 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 6వ డివిజన్ కార్పొరేటర్ మమతా ప్రవీణ్ బిఆర్ఎస్ పార్టీని వీడి బిజెపిలో చేరారు. 2020వ సంవత్సరంలో బిజెపి అభ్యర్థిగా డివిజన్‌నుండి పోటీ చేసి విజయం సాధించిన ఆమె ఆ తర్వాత అప్పట్లో మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఆ పార్టీకి గుడ్ బై చెప్పి స్వంత గూటికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ ఆధ్వర్యంలో చేవెళ్ళ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో ఆమె కాషాయ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి బిజెపిలో చేరిన మమతా ప్రవీణ్‌కు కండువా వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి, మహేశ్వరం అసెంబ్లీ బిజెపి కన్వీనర్ యెల్మేటి దేవేందర్‌రెడ్డి, మీర్‌పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు పెండ్యాల నర్సింహా, మహిళామోర్చా అధ్యక్షురాలు రాత్లావత్ నీలా రవినాయక్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు బెల్లంకొండ నాగరాజు, చెవ్వ శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత : పీఠాధిపతులు



సమావేశంలో మాట్లాడుతున్న స్వామిజీలు

**సైదాబాద్, మే 8 ప్రభాతవార్త:** హిందూ ధర్మ పరిరక్షణకు కట్టుబడే వారికే ఓటు వేయాలని భువనేశ్వ పీఠం పీఠాధిపతి కమలానంద భారతి స్వామి, గాయత్రి పీఠం పీఠాధిపతి శ్రీ కాంతేంద్ర స్వామి, కాలజ్ఞాన పీఠం వెంకటేశ్వ రాచార్య స్వామి, బైరామల్‌గూడ శివ పార్వతి మాతాజి, వీర ధర్మజ పీఠం వీర ధర్మజ స్వామిజిలు పిలుపునిచ్చారు. రాష్ట్రీయ వానరసేన ఆధ్వర్యంలో సైదాబాద్ వినయ్‌నగర్‌లోని శ్రీ విజయవినాయక దేవాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు స్వామీజిలు మాట్లాడుతూ నేతలు దేవాలయ భూములు కబ్జా చేసి, స్వంత లబ్ది కోసం పార్టీలు మారుతున్నారని, హిందూ సమాజం ఐక్యం కావాల్సిన అవసరముందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు బ్రహ్మాస్త్రం లాంటిదన్నారు. దేశం కోసం, ధర్మం కోసం కృషి చేసే పార్టీలకు మాత్రమే ఓటు వేయాలని వారు కోరారు. సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వానరసేన జాతీయ అధ్యక్షుడు నామ్ రాంరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు మాధవరెడ్డి, కార్యదర్శి కేశవర్ధన్‌రెడ్డి, బిజెపి ధార్మిక సెల్ సంయుక్త కన్వీనర్ కరాటే కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో మానసిక ఒత్తిళ్లు దూరం అవుతాయి : యోగా గురువు ఇస్మాయిల్



యోగా నిర్వహిస్తున్న దృశ్యం

**ఎల్.బి.నగర్, మే 8 ప్రభాతవార్త :** సంపూర్ణ ఆరోగ్యానికి యోగ సాధన ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రస్తుత తరుణంలో మానసిక ఒత్తులతో సతమతమవుతున్నటువంటి మానవాళికి యోగా ఒక గొప్ప వరమని ప్రముఖ యోగ గురువు ఇస్మాయిల్ గురూజీ పేర్కొన్నారు. సరూర్ నగర్ డివిజన్ హుడా కాంప్లెక్స్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్లో 10 రోజుల పాటు నిర్వహించే యోగ శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులు కావడంతో మహిళలు ఆరోగ్యాన్ని చక్కదిద్దుకోవడానికి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామని తెలిపారు. నిత్యం పనులు ఒత్తిడితో విశ్రాంతి లేకుండా మనసును కష్టపెట్టడం వలన ఎన్ని రకాల అనారోగ్య సమస్యలు వెంబడిస్తున్నాయని కొద్దిపాటి శారీరక శ్రమతో వాటన్నిటిని దూరం చేసుకోవడానికి యోగ గొప్ప ఆయుధమని అన్నారు. ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని యోగ శిక్షణ నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతున్నరన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొని యోగ సాధన చేయడం జరిగింది. అనంతరం యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని నేను యోగా చేస్తాను. ఆరోగ్యంగా ఉన్నాను. మరి మీరు అనేటువంటి ప్ల కార్డ్స్ ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో దుగ్యాల నరేందర్, దయాదేవి, యోగ ప్రచారక్ పొనగాని ఉపేందర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి అష్టలక్ష్మి బ్రహ్మోత్సవాలు విస్తృత ఏర్పాట్లు చేసిన దేవాలయ కమిటీ

**ఎల్.బి.నగర్, మే 8 ప్రభాతవార్త:** ఆదిలక్ష్మి సమేత శ్రీమన్నారాయణుడు వెలసిన అష్టలక్ష్మి దేవాలయం బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. వారం రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలను తిలకించడానికి సుమారు లక్షమందికిపైగా భక్తులు హాజరు కానున్నట్లు దేవాలయం కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని అష్టలక్ష్మి దేవాలయం 28వ ఇష్టి సహిత బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. సుమారు 3 దశాబ్దాలుగా అష్టలక్ష్మి దేవాలయంలో బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలను తిలకించడానికి నగరంతో పాటు వివిధ జిల్లాలో ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు లక్షలాదిగా తరలివస్తారు. కోరినకోరికలు తీరుస్తూ భక్తుల కొంగుబంగారంగా మారిన అష్టలక్ష్మి దేవాలయం బ్రహ్మోత్సవాలలో భాగంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గత వారంరోజులుగా అవసరమైన మౌలిక వసతులను దేవాలయం కమిటీ ఏర్పాటు చేసింది. వేసవి కాలం ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని దేవాలయం ప్రాంతం మొత్తం పెద్దఎత్తున పందిరి వేశారు. అదేవిధంగా వేలాదిగా తరలివచ్చే భక్తులకు ప్రతిరోజు అన్నప్రసాదం అందజేయడంతో పాటు మంచినీరు, మజ్జిగను కూడా అందజేసేందుకు దేవాలయ కమిటీ ఏర్పాటు చేసింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా తిరుచిపల్లకిసేవ, శేషవాహనసేవ, హంసవాహనసేవ, సూర్యప్రభ వాహనసేవ, చంద్రప్రభవాహనసేవ, గజవాహనసేవ, హనుమత్‌వాహనసేవ, అశ్వవాహనసేవ, గరుడవాహనసేవ, సింహవాహనసేవ, కల్పవృక్షవాహన సేవ, చిన్న, పెద్ద రథోత్సవ కార్యక్రమాలను వేలాదిమంది భక్తుల కోలాహలం మధ్య భారీఎత్తున నిర్వహించనున్నారు. అదేవిధంగా శ్రీలక్ష్మీనారాయణఇష్టి, శ్రీవరాహేష్టి, శ్రీసుదర్శన్‌ఇష్టి, శ్రీనృసింహఇష్టి, శ్రీహయగ్రీఇష్టి తదితర ఐదు ఇష్టిలను ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ఈనెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వారం రోజులపాటు ఉదయం నుంచి రాత్రి వరకు నిర్విరామంగా అష్టలక్ష్మి బ్రహ్మోత్సవాలు భారీగా నిర్వహించనున్నారు.

## అక్రమంగా నిర్మించిన షెడ్లను శాశ్వతంగా తొలగించాలి : కార్పొరేటర్ లచ్చిరెడ్డి



ధర్నా నిర్వహిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, సామ రంగారెడ్డి తదితరులు

**వనస్థలిపురం, మే 8 ప్రభాతవార్త :** సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ వద్ద జరిగిన సంఘటన మళ్లీ పునరావృత్తం కాకుండా ఉండడానికి అక్కడ అక్రమంగా నిర్మించిన షెడ్లను శాశ్వతంగా తొలగించాలని బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి జిహెచ్‌ఎంసి అధికారులకు పలుమార్లు చెప్పిన పట్టించకపోవడంతో ఆదివారం జరిగిన సంఘటన నిదర్శనంగా అక్రమ నిర్మాణ షెడ్లను తొలగించాలని రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి రోడ్డుపైన బైఠాయించి నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి ఎఎంహెచ్‌ఓ లావణ్య నిర్లక్ష్యంవల్ల ఒక నిండు ప్రాణం బలి తీసుకున్న దృశ్యం సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ వద్ద చోటు చేసుకుందని, పండ్ల షెడ్లను తొలగించాలని పలుమార్లు చెప్పిన జిహెచ్‌ఎంసి అధికారులు పట్టించుకోలేదని అక్రమంగా నిర్మించిన పండ్ల షెడ్ల కారణంగా ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ఒక అబ్బాయి పైన రోహింగ్య ముస్లిమ్‌కు చెందిన వ్యక్తి హత్యాయత్నం చేసారు. ఎవరైతే హత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తి పైన వెంటనే న్యాయ పరమైన, చట్టపరమైన శిక్షలు విధించాలని కోరారు. వెంటనే అక్కడ అక్రమంగా నిర్మించిన షెడ్లను తొలగించాలని డిమాండ్ చేసారు.

## సింగరేణి కాలనీలో సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం : ఇటి నర్సింహ్మా



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈటి నరసింహ

**సైదాబాద్, మే 8 ప్రభాతవార్త:** సిపిఐ హైద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని జిల్లా కార్యదర్శి ఛాయాదేవి అధ్యక్షతన సింగరేణి కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యనఅతిథిగా హాజరైన సిపిఐ తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటి నరసింహ మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న మోది ప్రభుత్వానికి దేశంలోని కొన్ని మీడియా సంస్థలు బాకా ఊదుతున్నాయని అన్నారు. బిజెపిపై ప్రజల్లో వ్యతిరేకతను గమనించిన ప్రధాని మోడి, కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేస్తూ దిగజారుడు రాజకీయం చేస్తున్నారని ఆయన విమర్శించారు.గత ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో బిజెపి పూర్తిగా విఫలమైందన్నారు. ఈసారి నరేంద్రమోడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఓటు హక్కు అనేది ఉండదని, రాచరిక పాలన వస్తుందని, పార్లమెంటరీ వ్యవస్థ లేకుండా చేయాలనేది బిజెపి రహస్య ఎజండా అని ఆయన ఆరోపించారు. సెక్యులర్ వ్యవస్థను బలపరిచే ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు శంకర్ నాయక్, కమతం యాదగిరి, స్టాలిన్, సక్రిభాయి, రాజ్ కుమార్, మహమూద్, జంగయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సరూర్‌నగర్ బహిరంగ సభకు హాజరు కానున్న రాహుల్‌గాంధీ: దేప



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, మే 8 ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్లమెంట్ అభ్యర్థికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రాహుల్ గాంధీ గురువారం సాయంత్రం 5 గంటలకు సరూర్‌నగర్ స్టేడియం మైదానంలో జరిగే సభకు హాజరవుతున్నారని టిపిసిసి సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆర్కే పురం డివిజన్ వాసవికాలనీలోని పార్టీ కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, ఆర్కేపురం డివిజన్ అధ్యక్షులు పున్న గణేష్‌నేత, యువజన కాంగ్రెస్ నాయకులు రమేష్ నేత, బొడ్డుపల్లి మహిందర్, యాదవరెడ్డి, సురేష్, గోపాల్ రెడ్డి, పగడాల శ్రీశైలం, పురుషోత్తం, సైదులు, కృష్ణ మణికంఠ, శ్రీకాంత్, జావేద్ పాల్గొన్నారు.

## జన జాతర సభను విజయవంతం చేయాలి : చల్లా నర్సింహ్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా నర్సింహ్మారెడ్డి, చిత్రంలో మల్‌రెడ్డి రాంరెడ్డి, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

**ఎల్.బి.నగర్, మే 8 ప్రభాతవార్త:** సరూర్‌నగర్ స్టేడియంలో గురువారం సాయంత్రం నిర్వహించే జన జాతర సభకు ముఖ్య అతిథులుగా యువ నాయకుడు రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటున్నారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైతన్యపురి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, జిహెచ్‌ఎంసి ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి సమావేశమయ్యారు. గురువారం సాయంత్రం 6 గంటలకు సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే జన జాతర సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్రం శ్యామ్ చరణ్‌రెడ్డి, పన్యాల జైపాల్‌రెడ్డి, జహంగీర్ బాబు, భాను తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి : కాలనీ అసోసియేషన్



ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న కాలనీ అసోసియేషన్ సభ్యులు

**వనస్థలిపురం, మే 8 ప్రభాతవార్త :** హరిహరపురం సీనియర్ సిటిజెన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కాలనీ వీధులలో తిరుగుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని, మే 13న ప్రతి ఓటర్ తమ ఓటు హక్కు వినియోగించుకుని అధిక శాతం పోలింగ్ జరిగేలా దోహద పడాలని ప్రచారం నిర్వహించారు. వివిధ రకాల స్లో గన్లతో ప్లేకార్డ్‌లు ప్రదర్శించి ఓటు విశిష్టత, ఓటరుకు ఉన్న రాజ్యాంగ హక్కుల వంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాల్సిన భాధ్యతను వివరిస్తూ అసోసియేషన్ అధ్యక్షుడు స్వతంత్రరెడ్డి, జనరల్ సెక్రటరీ శ్రీ రాయుడు ఈశ్వరరావు అధ్వర్యంలో కాలనీవాసులను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమములో అసోసియేషన్ సభ్యులు ఏ.వి. రమణ, రఘుపతిరావు, సీనియర్ సిటిజన్స్ డాక్టర్ ఎన్.నారాయణరెడ్డి, తొలిసన్న, రవీంద్రకుమార్, వనజాక్షి, వెంకటయ్య, రంగనాథం, పులిజల రవీంద్రరావు, నర్సింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎంలను భద్రపరిచిన అధికారులు

**ఎల్.బి.నగర్, మే 8 ప్రభాతవార్త:** ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. తెలంగాణ లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గంలోని ఎల్.బి.నగర్ అసెంబ్లీ సెగ్మెంట్ కి సంబంధించిన ఈవియంల కమిషనింగ్ కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ ఎన్నికల అధికారి పంకజ తెలిపారు. కమిషనింగ్ ముగిసిన అనంతరం ఈవియం మెషిన్లను స్ట్రాంగ్ రూంలో ఎన్నికల అధికారులు, భద్రత సిబ్బంది, పొలిటికల్ పార్టీ అభ్యర్థుల సమక్షంలో భద్రపరచడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహణ సజావుగా జరగడానికి అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు.

## తెలంగాణ రాష్ట్ర దూదేకుల సంఘం అధ్యక్షుడు మొయినుద్దీన్ కాంగ్రెస్‌లో చేరిక

**సరూర్‌నగర్, మే 8 ప్రభాతవార్త:** రాష్ట్ర దూదేకుల సంఘం అధ్యక్షుడు మహ్మద్ మొయినుద్దీన్ కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పార్టీ రాష్ట్ర కోశాధికారి మహ్మద్ షబ్బీర్, సంయుక్త కార్యదర్శి ఎండి రాజ్ మహ్మద్‌లు సైతం హస్తం తీర్థం తీసుకున్నారు. బుధవారం మీర్‌పేట్ టికెఆర్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ బిసి ఫెడరేషన్ ఇంఛార్జి వజ్రోజు రవీ ంద్రాచారి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సమక్షంలో వారు కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ సందర్భంగా తీగల వారికి కాంగ్రెస్ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిద్దాల దశరథ, పద్మారెడ్డి, పద్మశ్రీ, ఎర్రబెల్లి అరుణ, కీర్తి, గండికోట అంజయ్య, ఆల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ మద్దతు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిం రేవంత్‌రెడ్డి, మంత్రి సురేఖ తదితరులు

**మలక్‌పేట, మే 8 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ మద్దతు ప్రకటించింది. తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పార్టీకి మద్దతు ప్రకటిస్తూ ముద్రించిన పోస్టర్‌ను లారీ ఓనర్స్ ప్రతినిధులతో కలిసి సిఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఛైర్మన్ రామినేని శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జగన్నాథ్‌రెడ్డి, సలీంభాయ్ తదితరులు మాట్లాడుతూ కొద్ది రోజుల క్రితం మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి పార్టీ విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు గుమ్మడి దుర్గాప్రసాద్, ఆవుల రామారవు, సాధిక్‌భాయ్, చాంద్, గణేష్ యాదవ్, మహ్మద్ అక్బర్, నవాజ్‌గోరి తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ళ పార్లమెంట్ ఐఎన్‌టియుసి కో-ఆర్డినేటర్లుగా రవీంద్రనాథ్, జ్ఞానోధర్

**సరూర్‌నగర్, మే 8 ప్రభాతవార్త:** చేవెళ్ళ పార్లమెంటరీ నియోజకవర్గ ఐఎన్‌టియుసి కో-ఆర్డినేటర్లుగా రంగారెడ్డి జిల్లా ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి జి.రవీంద్రనాథ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బిడిఎల్ఇటియుసి ఉపాధ్యక్షుడు కొము్మ జ్ఞానోధర్‌లు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఐఎన్‌టియుసి అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డి చంద్రశేఖర్ వారిని జిల్లా కో-ఆర్టినేటర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు అందుకున్న రవీంద్రనాథ్ మాట్లాడుతూ చేవెళ్ళ ఎంపి ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డికి ఐఎన్‌టియుసి మద్దతు ఇస్తున్నదని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ఎంఇఎస్, మిధాని, బిడిఎల్, డిఫెన్స్ సివిలియన్ ఎంప్లాయీస్ కాం గ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.

## పవర్ లిఫ్టర్ ప్రణయ్‌కు ఎమ్మెల్యే సత్కారం



పవర్ లిఫ్టర్ ప్రణయ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, భాస్కర్ తదితరులు

**ఉప్పల్, మే 8 ప్రభాతవార్త :** ఆసియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో 3 స్వర్ణాలు సాధించిన ఉప్పల్ శేషసాయినగర్‌కు చెందిన జె.ప్రణయ్ రాజ్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ప్రణయ్ అంతర్జాతీయ స్థాయి పోటీలలో రాణించి మూడు స్వర్ణాలు సాధించడం అభినందనీయమన్నారు. విదేశీగడ్డపై సత్తా చాటిన ఉప్పల్ విద్యార్థిని మనకు ఎంతో గర్వకారణమన్నారు. క్రీడాకారులకు తన వంతు సహకారం అందిస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వంతో చర్చించి అతనికి తగు చేయూత అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేతలు అరటికాయల భాస్కర్, మేకల మధుసూధన్‌రెడ్డి, వేముల సంతోష్‌రెడ్డి, మస్క సుధాకర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలుగూరి శ్రీకాంత్, అన్య బాలకృష్ణ, పంగ రాజేష్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



బాక్స్ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, మే 8 ప్రభాతవార్త:** ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని వైఎస్ఆర్ గార్డెన్స్ వెనుక జిహెచ్‌ఎంసి బాక్స్ డ్రెయిన్‌ను కాదని కొందరు వ్యక్తులు స్వంతంగా బాక్స్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టడంతో బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనప్రియనుంచి వడ్డెరబస్తీ మీదుగా సరూర్‌నగర్ చెరువు వరకు జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో కోట్లాది రూపాయలతో గతంలోనే బాక్స్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. అయితే ఇప్పుడు కొందరు ఈ బాక్స్ డ్రెయిన్‌ను తొలగించాలని చూస్తున్నారని, స్వతంగా వారే తమ ఇష్టానుసారం కొత్తగా బాక్స్‌డ్రెయిన్ నిర్మాణానికి పూనుకుంటున్నారని అన్నారు. వెంటనే ఈ పనులను ఆపాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## అమావాస్య సందర్భంగా అన్నదానం

**సైదాబాద్, మే 8 ప్రభాతవార్త:** అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్న ప్రసాద వితరణ ట్రస్టు అధ్యక్షుడు భగవాన్ అన్నారు. అమావాస్య సందర్భంగా భగవాన్ ఆధ్వర్యంలో చంపాపేటలోని శ్రీ నల్లపోచమ్మ, శ్రీ ఎర్రపోచమ్మ దేవాలయం ఎదురుగా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 12 నెలలుగా అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రవి ముదిరాజ్, సుశీల్ కుమార్, సంతోష్, ప్రవీణ్, వెంకటేష్, చింటూ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మేరు కులస్థులకు నామినేటెడ్ పోస్టులు కేటాయించాలి : పోల్కం శ్రీనివాస్



ర్యాలీగా తరలుతున్న పోల్కం శ్రీనివాస్ తదితరులు

**మలక్‌పేట, మే 8 ప్రభాతవార్త :** మేరు కులస్థులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని మేరు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోల్కం శ్రీనివాస్ మేరు పేర్కొన్నారు. చట్ట సభలల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించే పార్టీకి మద్దతుగా జాతీయ బిసి సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపుమేరకు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి సమావేశానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేరు కులస్థులకు చట్ట సభల్లో రాజ్యసభ, ఎమ్మెల్సీ ఎన్నికలలో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, ఛైర్మన్ పదవులు, డైరెక్టర్ పదవులు కేటాయించాలని డిమాండ్ చేసారు. పార్లమెంట్ ప్రత్యేకమైన పాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెన్ను శివకుమార్, పోల్కం వినయ్‌రాజ్, ఆదిమూలం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి : సుభాష్‌గౌడ్



ప్రదర్శిస్తున్న విద్యార్థులను అభినందిస్తున్న సుభాష్‌గౌడ్ తదితరులు

**మలక్‌పేట, మే 8 ప్రభాతవార్త :** విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని మలక్‌పేట శ్రీ వాణి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ సుభాష్‌గౌడ్ పేర్కొన్నారు. కళాశాల ఫేర్‌వెల్ డే కార్యక్రమాన్ని మలక్‌పేటలోని సిమ్లా గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ఏర్పాటు చేసి 30 సంవత్సరాలు అయ్యాయని, అత్యుత్తమ అధ్యాపక బృందంతో అధునాతన పద్ధతిలో విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధిస్తున్నామన్నారు. విద్యార్థులు పాజిటివ్ దృక్పథంతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని తమ కళాశాలకు తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. వివిధపోటీలు, ఉత్తమ ప్రతిభ సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేసారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ ఆర్.రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ అనుప్రియ, అధ్యాపకులు గిరిధర్, జాన్, సునీతరావు, దామిని, బిందు, కార్తీక్, రాములు, మహమూద్‌ఖాన్, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.